క్లుప్తంగా

పది పరీక్షలకు 25 మంది గైర్హాజరు

చిట్వేలి : మండలంలో పదోతరగతి సప్లిమెంటరీ పరీక్షలకు 25 మంది గైర్హాజరైనట్లు మండల విద్యాశాఖ అధికారి కోదండనాయుడు పేర్కొన్నారు. ఈ మేరకు ఎంఈఓ మాట్లాడుతూ స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం జరిగిన సప్లిమెంటరీ పరీక్షల్లో మొదటి రోజు తెలుగు సబ్జెక్టుగాను మండల వ్యాప్తంగా 49 మంది విద్యార్థులు హాజరుకావాల్సి ఉండగా 24 మంది విద్యార్థులు మాత్రమే హాజరయ్యారన్నారు.

ఘనంగా ముగిసిన కాలభైరవుడి తిరునాల


భక్తులకు అన్నప్రసాదం అందిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

రాయచోటి టౌన్ : రాయచోటి రూరల్ పరిధిలోని యండపల్లె సమీపంలోని గుట్టపై వెలసిన శ్రీ కాలభైరవుడి తిరునాల భక్తి శ్రద్ధలతో అంగరంగ వైభవంగా నిర్వహించారు. శుక్రవారం స్వామి వారికి ప్రత్యేక పూజలు, అలంకరణలతో ముగించారు. ఉదయం నుంచి వేదపండితుల ఆధ్వర్యంలో అభిషేకాలు, పూజలు నిర్వహించి భక్తుల దర్శన ఏర్పాటు చేశారు. ఆలయానికి వచ్చిన భక్తులకు దాతలు బి.రెడ్డెన్న, బి.అన్నపూర్ణ, బి.రెడ్డికుమార్, బి.రెడ్డిహేమంత్‌ల దాతృత్వంలో అన్నప్రసాదం అందించారు. పూజలు, తిరునాల కార్యక్రమాలు ఆలయ కమిటీ అధ్యక్షులు మాజీ ఎంపీపీ పోలు సుబ్బారెడ్డి, సెక్రటరీ ధర్మారెడ్డి, కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో నిర్వహించారు.

చిన్నకొత్తపల్లెలో నాకాబందీ


నాకాబందీ నిర్వహిస్తున్న పోలీసులు

ఒంటిమిట్ట : మండల పరిధిలోని చిన్నకొత్తపల్లి గ్రామంలో శుక్రవారం ఒంటిమిట్ట సీఐ పురుషోత్తం రాజు, ఎస్ఐ మధుసూదన్, పోలీసు సిబ్బంది నాకాబందీ నిర్వహించారు. అనుమానం ఉన్న ఇళ్లల్లో సోదాలు నిర్వహించారు. అనంతరం వారు గ్రామస్తులతో మాట్లాడుతూ ఎలక్షన్‌తో సంబంధం లేకుండా గ్రామంలో ప్రశాంత వాతావరణం ఉండేలా గ్రామస్తులు సహకరించాలన్నారు. గొడవలకు పాల్పడితే క్రిమినల్ చర్యలు తీసుకుంటామన్నారు. యువత బెట్టింగ్‌లకు పాల్పడి విలువైన జీవితాన్ని నాశనం చేసుకోవద్దన్నారు.

అమ్మవారికి రాహుకాల పూజలు


భక్తులకు దర్శనమిస్తున్న భద్రకాళి

రాయచోటి టౌన్ : పట్టణంలోని వీరభద్ర స్వామి వారి ఆలయంలో వెలసిన శ్రీ భద్రకాళీ అమ్మవారికి భక్తిశ్రద్ధలతో రాహుకాల పూజ నిర్వహించారు. శుక్రవారం అమ్మవారికి అభిషేకాలు, పూజలు జరిపారు. అమ్మవారిని పూలు, పట్టువస్త్రాలు, బంగారు ఆభరణాలు, నిమ్మకాయల హారాలతో అందంగా అలంకరించారు. అలాగే మహిళలు నిమ్మకాయలపై వత్తులు వెలిగించి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం భక్తులకు అన్నప్రసాదాలు అందజేశారు.

వైభవంగా గ్రామోత్సవం


స్వామి వారి గ్రామోత్సవ దృశ్యం

పెనగలూరు (ఓబులవారిపల్లె) : మండలంలోని ఈటమాపురం గ్రామంలో శ్రీ లక్ష్మీనరసింహస్వామి గ్రామోత్సవం గురువారం రాత్రి వైభవంగా జరిగింది. పెంచల కొండ లక్ష్మీనరసింహ స్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా గ్రామంలో శ్రీదేవి భూదేవి సమేత నరసింహస్వామి వారికి గ్రామోత్సవ కార్యక్రమాన్ని గ్రామస్తులు ఘనంగా నిర్వహించారు. ప్రతి ఇంటివద్ద భక్తులు కాయాకర్పూరం సమర్పించి తమ మొక్కులు తీర్చుకున్నారు. గ్రామోత్సవానికి చుట్టుపక్కల గ్రామాల ప్రజలు హాజరయ్యారు.

వడ్డిపల్లెలో కార్డెన్‌సెర్చ్

మదనపల్లె : వడ్డిపల్లెలో నిర్వహించిన కార్డెన్‌సెర్చ్‌లో కర్నాటక మద్యం విక్రయిస్తున్న ఓ వ్యక్తిని అరెస్టుచేసి, 35 టెట్రా ప్యాకెట్లు స్వాధీనం చేసుకుని నిందితుడిని శుక్రవారం అదుపులోకి తీసుకున్నట్టు సీఐ వలీబాషు తెలిపారు.

లక్ష్మీనృసింహుని కల్యాణం.. పోటెత్తిన భక్తజనం

- దారులన్నీ భువనగిరిపల్లి వైపే
- కల్యాణోత్సవంలో వేల సంఖ్యలో పాల్గొన్న భక్తులు
- స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో భక్తులకు సేవలు


దేవదేవేరులకు కల్యాణం నిర్వహిస్తున్న వేదపండితులు


ప్రత్యేక అలంకరణలో కల్యాణ ఉత్సవ మూర్తులు

రాజంపేట రూరల్ : జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన భువనగిరి శ్రీలక్ష్మీ సమేత నృసింహ స్వామి కల్యాణ మహోత్సవం శుక్రవారం అత్యంత కమనీయంగా సాగింది. కల్యాణాన్ని తిలకించేందుకు జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. ఉదయం నుంచే వివిధ గ్రామాలకు చెందిన ప్రజలు కల్యాణ మహోత్సవంలో పాల్గొనేందుకు రాజంపేటకు తరలి రావడంతో భువనగిరపల్లి వైపు వెళ్లే దారులన్నీ జనసంద్రాన్ని తలపించాయి. తొలుత స్వామి, అమ్మవార్ల ఉత్సవ మూర్తులను పట్టువస్త్రాలతో, ప్రత్యేక పుష్పాలతో శోభాయమానంగా అలంకరించారు. అనంతరం ప్రత్యేక వేదికపై ఉత్సవ మూర్తులను కొలువుదీర్చి వేదపండితులు వేదమంత్రోచ్చరణలతో స్వామి కల్యాణ క్రతువును అంగరంగ వైభవంగా నిర్వహించారు. స్వామి వారు లక్ష్మీదేవికి మాంగళ్యదారణ చేసే సమయంలో భక్తులు తన్మయత్వంతో ఆ మధుర క్షణాలను వీక్షించారు. ఒకవైపు రద్దీ ఎక్కువగా ఉన్నప్పటికి మహిళలు, వృద్ధులు సైతం స్వామి వారి కళ్యాణ మహోత్సవాన్ని కనులారా తిలకించి, పులకించిపోయారు. కల్యాణ మహోత్సవాన్ని పురస్కరించుకొని స్వామి వారికి భువనగిరిపల్లి కోదండరామస్వామి ఆలయం నుంచి కొండపైకి మాజీ మంత్రి పసుపులేటి బ్రహ్మయ్య కుమారులు పసుపులేటి వీరప్రదీప్, రమ్య, పసుపులేటి పవన్‌కుమార్, సింధు దంపతులు వారి కుటుంబ సభ్యులు, ఆలయ ధర్మకర్తలతో కలిసి పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలను కొండ పైకి కాలినడకన తీసుకొచ్చి స్వామి వారికి సమర్పించారు. క్రిష్ణచైతన్య అన్నదాన ట్రస్ట్ కువైట్ అధ్యక్షులు ఇండ్లూరు వజ్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేశారు. అలాగే వివిధ స్వచ్ఛంద సంస్థలకు చెందిన వారు మజ్జిగ, మంచినీరు, అన్నదాన కార్యక్రమాలను ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు, ఉత్సవ కమిటీ ప్రతినిధులు, గ్రామపెద్దలు, భక్తులు పాల్గొన్నారు.


కల్యాణాన్ని తిలకిస్తున్న భక్తులు


తలంబ్రాలు తీసుకొస్తున్న పసుపులేటి బ్రహ్మయ్య కుటుంబీకులు


భక్తులకు అన్నదానం చేస్తున్న స్వచ్ఛంద సంస్థలు

చికెన్ ధరలు పైపైకి..



రాయచోటి టౌన్ : ఆదివారం వచ్చిందంటే ధనికుల నుంచి సామాన్యుల వరకు ఠకీమని గర్తుకొచ్చేది... చికెన్. చిన్న కుటుంబం అయినా సరే కిలో చికెన్ ఉదయమే తీసుకొచ్చి ఆ రోజు మాంసాహారాన్ని రుచి చూడానిది ఉండలేరు. కానీ చికెన్ ధరలు రోజురోజుకి పెరుగుతూ పోతున్నాయి. కొన్ని వారాల క్రితం రూ.200 లోపు ఉన్న చికెన్ ధరలకు అమాంతం రెక్కలొచ్చేశాయి. ప్రస్తుతం ఒక కుటుంబం ఒక పూట చికెన్ తినాలంటే రూ.300 వరకు జేబు నుంచి తీయాల్సిందే. మార్కెట్లో కేజీ చికెన్ ధర రూ.270 ఉండగా, కేజీ స్కిన్ లెస్ చికెన్ ధర రూ.290కు చేరింది. దీంతో మాంసాహారాలు రెండు కిలోలు కొనే వారు కేవలం కిలోతేనే సరిపెట్టుంటున్నాడు. ఇక అతి సామాన్యుడు అయితే చికెన్‌కు బదులుగా కోడిగుడ్లు తెచ్చుకొని కాస్త టమాటతో సర్దిపెట్టుకోవాల్సి వస్తోంది. పెరిగిన చికెన్ ధరలపై విక్రయదారులను విచారించగా ఈ ఏడాది ఎండలు ఎక్కువ కావడం వలన చికెన్ ఉత్పత్తి తగ్గిందని అంతే కాకుండా ఉత్పతి కేంద్రాలలో వీటిని పెంచడం తగ్గించారని చెప్పారు. బ్రాయిలర్ కోళ్లు ఎండల వేడిమిని భరించలేక చనిపోతాయని దీంతో కోళ్ల పెంపకం దారులు రెండు నెలల కాలాన్ని హాలీడేగా ప్రకటించారని చెప్పారు. అందుకే ఈ ధరలు పలుకుతున్నాయన్నారు. మరో రెండు, మూడు వారాలు ఇదే పరిస్థితి కొనసాగవచ్చని చెబుతున్నారు.

సంయమనం పాటించాలి


నూలివీడులో అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ వెంకట్

గాలివీడు : శాంతి భద్రతలకు భంగం కలిగిస్తే చర్యలు తప్పవని మండల ఎస్ఐ వెంకటప్రసాద్ తెలిపారు. శుక్రవారం మండలంలోని నూలివీడు గ్రామంలో కేంద్ర బలగాలతో కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్ చేసి ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. మాట్లాడుతూ ఓట్లు లెక్కింపు రోజు గ్రామాల్లో అల్లర్లు జరగకుండా, అనుమానిత గృహాల్లో పోలీసులు తనిఖీలు చేశారు. గ్రామంలోని వీధుల్లో పర్యటించి గ్రామస్తులకు ఓట్లు లెక్కింపు రోజు అల్లర్లు, పరస్పర దాడులకు పాల్పడకుండా ఉండాలంటూ తెలియజేశారు. ఓటింగ్ తరువాత జిల్లాలో కొన్ని ప్రాంతాల్లో గొడవలు, హత్యాయత్నాలు జరగడంతో పోలీసులు అప్రమత్తమయ్యారు. ఓట్లు లెక్కింపు రోజు గ్రామాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఉండేందుకు ముందస్తు చర్యలు తీసుకుంటున్నట్లు ఎస్ఐ తెలిపారు.

శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు



మాట్లాడుతున్న రాజంపేట ఆర్ఓ మోహనరావు, డీఎస్పీ చైతన్య

- ప్రశాంతంగా కౌంటింగ్ ప్రక్రియ జరిగేలా సహకరించండి
- వివిధ రాజకీయ పార్టీల నాయకుల సమావేశంలో ఆర్ఓ మోహన్‌రావు


సమావేశంలో పాల్గొన్న వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు

రాజంపేట : వచ్చే నెల 4న జరిగే ఎన్నికల కౌంటింగ్ ఫలితాల వేళ శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు ఉంటాయని రాజంపేట రిటర్నింగ్ ఆఫీసర్ టి.మోహనరావు, డీఎస్పీ చైతన్యలు హెచ్చరించారు. శుక్రవారం అన్నమయ్య సభా భవనంలో శాంతిభద్రతలకు గురించి అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులతో పీస్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపు ప్రక్రియ ప్రశాంతంగా జరిగేందుకు రాజకీయ నాయకులు సహకరించాలన్నారు. అలా కాకుండా ఫలితాల వేళ శాంతికి విఘాతం కల్గిస్తే చర్యలు తప్పవన్నారు. ఓట్ల లెక్కింపు ప్రక్రియలో ఏజెంట్లు పాటించాల్సిన నిబంధనలు గురించి కౌంటింగ్ ఏజెంట్లు తెలుసుకోవాల్సి ఉంటుందన్నారు. 288 పోలింగ్ కేంద్రాలకు గాను 14 టేబుల్స్ ఏర్పాటు చేశామన్నారు. 21 రౌండ్ల లెక్కింపు నిర్వహిస్తామన్నారు. పోస్టల్ బ్యాలెట్ ఓట్లను లెక్కించేందుకు 08 ప్రత్యేక టేబుళ్లు అందుబాటులో ఉంటాయన్నారు. ఎమ్మెల్యే అభ్యర్థులు తమ కౌంటింగ్ ఏజెంట్ల కోసం ఈనెల 30వ తేదీలోగా దరఖాస్తులు చేసుకోవాలన్నారు. ఏజెంట్ల ఫారం – 18 ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు. పోస్టల్ బ్యాలెట్‌కు కూడా ఏజెంట్లను నియమించుకోవచ్చునన్నారు. సమావేశంలో సీఐలు మద్దయ్య ఆచారి, టి.బాబు, మంజునాథరెడ్డి, రవీంద్రనాథ్, ఎస్ఐలు మహమ్మద్ అబ్దుల్ జహీర్, హుసేన్‌బాషా, చంద్రమోహన్, సుధాకర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

నెలాఖరులోపు దరఖాస్తు చేసుకోండి


ఏపీఓ సురేంద్రనాథరెడ్డి

రామాపురం : 2024–25 సంవత్సరానికి సంబంధించి మండలంలోని 13 గ్రామ పంచాయతీల పరిధిలోని 5 ఎకరాలు లోపు ఉన్న సన్నా, చిన్నాకారు రైతులు పండ్ల తోటల పెంపకానికి ఈనెల ఆఖరులోపు దరఖాస్తు చేసుకోవాలని ఏపీఓ సురేంద్రనాథరెడ్డి తెలిపారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఉపాధి కార్యాలయంలో మాట్లాడుతూ పండ్ల తోటలు పెంచుకునే రైతులు దరఖాస్తులు చేసుకుంటే వారికి మొక్కలతోపాటు మూడు సంవత్సరాలపాటు ఎరువులు, కలుపులు, నీటి వసతి, కూలీల డబ్బులు ఉపాధి హామీ నిధుల ద్వారా పొందవచ్చునన్నారు. పండ్లతోట వివరాలు నిమ్మ, జామ, సపోట, చీనీ, దానిమ్మ, అల్లనేరుడు, డ్రాగన్ ఫ్రూట్ టెంకాయ చెట్లు, అలాగే పూల తోటలు మల్లె, రోజా, మునగ చెట్లను, రైతులకు ఇవ్వడం జరుగుతుందన్నారు. ఈ ఏడాదికి 300 ఎకరాలు టార్గెట్‌గా ఉన్నతాధికారులు మండలానికి నిర్ణయించారన్నారు. 2023–24 సంవత్సరానికి 315 ఎకరాలకు సంబంధించి 112 మంది రైతులు పండ్ల తోటలు పెంచడానికి మంజూరు చేసినట్టు పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని తెలియజేశారు.

వైభవంగా మల్లాలమ్మ తిరునాల

పెద్దమండ్యం: మండలంలోని సి.గొల్లపల్లె పంచాయతీలోని రెక్కలకొండలో వెలసిన మల్లాలమ్మ తిరునాల గురువారం రాత్రి వైభవంగా జరిగింది. తిరునాల సందర్భంగా భక్తులు చాందినీబండ్లు కట్టి తమ మొక్కులు తీర్చుకున్నారు. తంబళ్లపల్లె ఎమ్మెల్యే ద్వారకనాథరెడ్డి ప్రత్యేక చొరవ తీసుకుని పెద్దమండ్యం–గాలివీడు. పెద్దమండ్యం–చిన్నమండ్యం రహదారుల నుండి ఆలయం వరకు తారురోడ్డును ఏర్పాటు చేశారు. దీంతో భక్తుల రాకపోకలకు ఇబ్బందులు లేకుండా పోయింది.

అమ్మవారి ఆలయాల్లో ప్రత్యేక పూజలు


పూజలందుకున్న భువనేశ్వరిదేవి


అలంకారంలో కొత్తకోడూరు గంగమ్మ

రైల్వేకోడూరు అర్బన్ : మండలంలోని పలు చోట్ల వెలసియున్న అమ్మవారి ఆలయాలలో శుక్రవారం మహిళలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే రాహుకాల దీపాలు వెలిగించి మొక్కులు తీర్చుకొన్నారు. గుండాలపల్లెలోని మారమ్మ, బొజ్జవారిపల్లెలోని రేణుకా ఎల్లమ్మ, గంగమ్మ, రాఘవరాజపురంలోని భ్రమరాంభికా, పట్టణంలోని భుజంగేశ్వర, కొత్తకోడూరు గంగమ్మలకు ఆలయాల్లో అభిషేకాలు నిర్వహించి అర్చనలు చేశారు. రాత్రి భజన బృందంచే భక్తిశ్రద్ధలతో భజనలు నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున మహిళలు పాల్గొన్నారు.

నేడు వీరాంజనేయ స్వామి తిరునాల


సంబేపల్లె మండలం గుట్టపల్లెలో వెలసిన వీరాంజనేయ స్వామి మూలవిరాట్


సిద్దవటం మండలం మాచుపల్లెలో కొలువైన రేణుకా యల్లమ్మ మూలవిరాట్

సంబేపల్లె : మండల పరిధిలోని గుట్టపల్లె సమీపంలో వెలసిన శ్రీ వీరాంజనేయ తిరునాలను శనివారం నిర్వహించనున్నట్లు సర్పంచ్ చిదంబర్‌రెడ్డి, నిర్వాహకులు తెలిపారు. శనివారం ఉదయం నుంచి స్వామి వారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అర్చనలు జరుపతామన్నారు. వచ్చే భక్తులకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని పేర్కొన్నారు. తిరునాల సందర్భంగా ఆలయాన్ని విద్యుత్ దీపాలు, వివిధ రకాల పుష్పాలతో సర్వాంగ సుందరంగా ముస్తాబు చేశారు. చిత్తూరు–కర్నూలు జాతీయ రహదారి నుంచి ఆలయం వరకు నూతనంగా సిమెంట్ రోడ్డు వేశారు.

నేడు రేణుకా యల్లమాంబ కల్యాణం

సిద్దవటం : మండలంలోని మాచుపల్లె గ్రామంలో వెలసిన రేణుకా యల్లమాంబ కల్యాణం శనివారం జరుపనున్నట్టు గ్రామ పెద్దలు తెలిపారు. రేణుకా యల్లమాంబ తిరునాల సందర్భంగా శనివారం సాయంత్రం జగజ్జనని రేణుకా యల్లమాంబ సమేత జమదగ్ని మహారాజు ఉత్సవమూర్తులకు కల్యాణోత్సవంలో భాగంగా అమ్మవారికి గణపతిపూజ, పుణ్యాహావాచనం, యజ్ఞోప విధారణ, కంకణాధారణ, జీలకర్ర బెల్లం, మాంగళ్యధారణ, ముత్యాల తలంబ్రాలు వంటి పూజా కార్యక్రమాలను భక్తి శ్రద్ధలతో నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. వేదపండితులు రంగసముంద్ర మల్లికార్జునశర్మ, సుబ్రమణ్యం శర్మ, ప్రదీప్‌శర్మలు వేదమంత్రాల మధ్య కల్యాణ క్రతువు చేస్తామన్నారు. భక్తులు అమ్మవారి మూలవిరాట్‌ను దర్శించుకొని కాయాకర్పూరాలను సమర్పించి తీర్థప్రసాదాలను స్వీకరించిన అనంతరం కల్యాణంలో పాల్గొనాలని కోరారు.